సాక్షి శ్రీకాకుళం

గురువారం । 4 । ఏప్రిల్ । 2024




మరో కొత్త పీజీ కోర్సు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీకి కొత్త పీజీ కోర్సు మంజూరైంది. ఆ మేరకు పత్రాలు అందుకున్నారు. - 8లో



చురుగ్గా ఆఫ్‌షోర్ పనులు

ఆఫ్‌షోర్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు కొండల మధ్య రిజర్వాయర్ గట్టు నిర్మిస్తున్నారు. - 8లో



న్యూస్‌రీల్

రూ. 2లక్షలు నగదు స్వాధీనం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లి జంక్షన్ వద్ద బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా రూ. 2 లక్షలు దొరికాయి. నువ్వలరేవు గ్రామానికి చెందిన లింగరాజు బెహరా ద్విచక్రవాహనంపై నగదుతో ప్రయాణం చేస్తుండగా ఈ నగదును పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యక్తి సరైన ఆధారాలు చూపకపోవడంతో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఈ నగదును సీజ్ చేసి శ్రీకాకుళం జిల్లా ట్రెజరీకి తరలించారు.

'శిక్షణ సద్వినియోగం చేసుకోండి'



రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఆత్మ పీడీ రామచంద్రరావు

ఆమదాలవలస: కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ రకాల శిక్షణలు అందిస్తున్నారని, శిక్షణలు పొందిన రైతులు దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆత్మ పీడీ పి.రామచంద్ర రావు సూచించారు. ఇటీవల కృషి విజ్ఞాన కేంద్రంలో యాంత్రీకరణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం ముగిస్తూ.. శిక్షణ పొందిన రైతులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రైతులకు సులభ పద్ధతిలో వ్యవసాయం చేసే అంశాలు ఆయన వివరించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్య లక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నీలవేణి, అభ్యుదయ రైతులు కొండబాబు, వరాహ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

సందేహాలు నివృత్తి చేసుకోండి: కలెక్టర్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, సెక్టోరియల్ అధికారులు తమ సందేహాలు నివృత్తి చేసుకుని ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో బుధవారం ఉదయం ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, సెక్టోరియల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంయుక్తంగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను మరోసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం జారీ చేసిన కొత్త నిబంధనల ప్రకారం ఎన్నికలను నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని చెప్పారు. శిక్షణ పొందిన రోజు నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్‌ఓలు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లపై ముందస్తు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈవీఎం నోడల్ అధికారి జిల్లా ఉపాధి అధికారి కె.సుధ ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పనితీరును వివరించారు. డ్వామా పీడీ చిట్టి రాజు పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ నిర్వహణ తదితర అంశాలపై వివరించారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలు చూపిస్తున్న వలంటీర్లతో ఎంవీ స్వరూప్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో మండలవీధితో పాటు 5 సచివాలయాల పరిధిలో గల సుమారు 150మంది వలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వలంటీర్లు స్వదస్తూరితో రాజీనామా పత్రాలు రాసి సచివాలయ ఉద్యోగులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలు లెక్కచేయకుండా ప్రజలకు అన్ని రకాల సేవలు అందించామన్నారు. వలంటీర్లుగా లేకపోయినా సంక్షేమ రథసారథి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటూ ఆయన్ను గెలిపించేందుకు సైనికుల్లా పనిచేస్తామని ముక్తకంఠంతో చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్ మాట్లాడుతూ 50 ఇళ్ల ఆత్మబంధువుగా ఉన్న వలంటీర్లను టీడీపీ నేతలు విద్రోహుల్లా చూడడం సరికాదన్నారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా వెనక్కి తగ్గబోమన్నారు.

మమ్మల్ని ఎండల్లో పడేసి.. పగ చల్లార్చుకున్నావా బాబూ!



కొత్తూరు మండలం పెదరాజపురం, చినరాజపురం, నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం నడుచుకుని పింఛను కోసం గొట్టిపల్లి సచివాలయానికి గిరిజన వృద్ధులు వచ్చారు. ఈ వయస్సులో వారు అంత దూరం నడిచారంటే ఎంత ప్రయాస పడ్డారో 72 ఏళ్లు దాటిన చంద్రబాబే చెప్పాలి.

పలాస మండలం మామిడిపల్లి గ్రామానికి అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులకు పింఛను కోసం రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న బొద్దపాడు సచివాలయానికి రావడానికి నానా యాతన పడ్డారు. వీరు పడ్డ అవస్థలు విమానాల్లోనూ, హెలికాప్టర్‌లో, ఏసీ వాహనాల్లో ప్రయాణించే 72ఏళ్ల చంద్రబాబుకు తెలియవు కదా..



- వృద్ధులు, వికలాంగుల్లో ఇదే ఆవేదన
- పింఛన్ల కోసం అవస్థలు
- వృద్ధుల నరకయాతన

తొలిరోజు 29.26% పింఛన్ల పంపిణీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఈ రెండు సచివాలయాల్లోనే కాదు దాదాపు జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయాల్లో ఇవే దృశ్యాలు కనిపించాయి. వలంటీర్ల సేవలను చంద్రబాబు అండ్ కో అడ్డుకోవడంతో పెన్షన్ కోసం పొద్దు పొద్దునే అవస్థలు పడుతూ అవ్వాతాతలు సచివాలయాలకు చేరుకున్నారు. నడవలేని నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు నరకయాతన అనుభవించారు. ఈ వయస్సులో తమను ఎందుకింత బాధ పెడుతున్నావంటూ నారా చంద్రబాబు నాయుడిపై మండిపడ్డారు. మండు టెండల్లో చెమటలు కక్కుకుని, ఆయాసంతో వణుకుతూ సచివాలయానికి వచ్చిన దృశ్యాలు చుట్టు పక్కల ఉన్నవారందరినీ చలింపచేశాయి.

పేదలంటే చిన్నచూపు..

పేదవారంటే చంద్రబాబుకు ఎప్పుడు చిన్న చూపే. కన్నీళ్లు తుడిచేందుకు ప్రయత్నించకుండా కన్నీళ్లు పెట్టించేందుకే ప్రయత్నించారు. గవర్నమెంట్ బడిలో ఇంగ్లిష్ మీడియం పెడతామంటే వద్దు అని కోర్టులకు వెళ్లారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే కోర్టులకెళ్లి అడ్డు తగిలారు. పట్టణ ప్రాంతాల్లోనైతే కులాల మధ్య సమతుల్యం దెబ్బ తింటుందని ఏకంగా కోర్టులకెళ్లి కేసులు వేశారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్న ఉద్దేశంతో మూడు రాజధానులను పెడతానంటూ కోర్టుల్లో కేసులేసి అడ్డుకున్నారు. ఇప్పుడు అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువుల వంతు వచ్చింది. వీరిపైనా కూడా చంద్రబాబు పగ బట్టి తమ జేబు సంస్థతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి ఇంటి వద్ద వలంటీర్లతో పింఛను అందకుండా చేశారు.

మండుటెండల్లో అష్టకష్టాలు

చంద్రబాబు బ్యాచ్ నిర్వాకంతో పింఛను కోసం మండు టెండల్లో నడుచుకుని సచివాలయానికి చేరుకుని పింఛను తీసుకోవాల్సిన దుస్థితి వచ్చింది. వయసులో ఉన్నవారే ఎండలను తట్టుకోలేని పరిస్థితి. అలాంటిది నడవలేని వయసులో నిస్సహాయులుగా ఉన్న వీరి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. చాలా మంది మండు టెండలను, వడగాడ్పులను తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయారు. ఎన్నికల సంఘం ఆంక్షల నేపథ్యంలో వలంటీర్ల స్థానంలో సచివాలయం ఉద్యోగుల చేత పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. సచివాలయం వద్ద టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించింది. కానీ అక్కడ వరకు రావడానికే వృద్ధులు, వికలాంగులు నరకయాతన అనుభవించారు. దాదాపు ఐదేళ్లుగా ఇంటి వద్దనే పింఛను తీసుకుంటున్న తమకు ఇప్పుడీ పరిస్థితేంటని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణమైన చంద్రబాబుపై మండిపడుతూ తమ ఉసురు తగలదా అని శాపనార్థాలు పెట్టారు.

ఎగతాళి చేస్తూ..

ముసలివాళ్లు కూరగాయలు తెచ్చుకోవట్లేదా.. సరుకులు తెచ్చుకోవట్లేదా.. పింఛన్లు తెచ్చుకోవడానికి ఏం నొప్పి.. అనే కండకావరంతో కొన్ని చోట్ల టీడీపీ నాయకులు సోషల్ మీడియా వేదికగా మాట్లాడటం మరింత ఆశ్చర్యం కలిగించింది. వీళ్ల అధికారంలోకి ముసలివాళ్లని, వికలాంగులను బతకనిస్తారా? అన్న అనుమానం కలిగించేలా చేసింది. పింఛను కోసం సచివాలయానికే రానోళ్లు రేపు ఓట్లు వేయడానికి ఎలా వస్తారంటూ సెటైర్లు వేస్తూ వృద్ధులు, వికలాంగులతో సోషల్ మీడియా వేదికగా నానా మాటలు అన్నారు.





ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి సచివాలయం వద్ద పింఛన్ కోసం ఎండలో పడిగాపులు కాస్తున్న వృద్ధులు

ప్రాణాలు అరచేతిలో పట్టుకొని..



పింఛన్ కోసం మండటెండలో నాలుగు కిలోమీటర్లు కొండ మీద నుంచి నడుచుకుని వచ్చాం. ఎండ చాలా ఎక్కువగా ఉంది. ఇలా పింఛన్లు పంపిణీ చేస్తే వృద్ధుల ప్రాణాలు పోతాయి.
– సవర చిన్నప్పన్న, గిరిజన పింఛన్‌దారుడు, పెద రాజపురం గిరిజన గ్రామం, కొత్తూరు మండలం

మరో మనిషి తోడుండాలి



నేను పింఛన్ తీసుకోవడానికి వెళ్లాలంటే మరో మనిషి తోడుండాలి. నాకు కాలు పని చేయదు. మరో వ్యక్తి సాయం కావాలి. ఇలా పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లాలంటే మా లాంటి వృద్ధులకు కష్టంగా ఉంటుంది.
– లిమ్మక నరసింహం, పింఛన్‌దారు, మహసింగి కాలనీ, కొత్తూరు

మండుటెండలో..



చిత్రంలోని వృద్ధుడి పేరు రేగి రాజారావు. మందస మండలంలోని బాలిగాం పంచాయతీ నుంచి మందస వచ్చి భిక్షాటన చేసుకుంటున్నాడు. పేద దళిత కుటుంబానికి చెందిన ఆయనకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల చొరవతో వలంటీర్లు ఆధార్, రేషన్‌కార్డులు చేయించి వృద్ధాప్య పింఛను కూడా మంజూరు చేయించారు. ప్రతి నెలా ఎక్కడ ఉన్నా వలంటీర్ పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయానికి వెళ్లాలని చెప్పడంతో మండుటెండలో మందస సచివాలయంలో ఇలా ఎదురు చూస్తున్నాడు. తనకు సకాలంలో పింఛను అందకుండా చేసిన నాయకులకు శాపనార్థాలు పెడుతున్నాడు. – మందస

ఉదయం నుంచి పడిగాపులే..



ఇప్పుడు నా వయస్సు 90 ఏళ్లు దాటుతుంది. ఈ నెల పింఛన్ సొమ్మును సచివాలయం వద్ద ఇస్తారని చెప్పడంతో ఈ రోజు ఉదయం వచ్చాను. ఎండ చాలా ఎక్కువగానే ఉండటంతో నీడలో కూర్చున్నాను. సాయంత్రం అవుతున్నా పింఛన్ ఇవ్వలేదు. ఇది వరకు వలంటీర్ ఉదయమే ఇంటికి డబ్బులు తీసుకువచ్చి ఇచ్చేవాడు.
– కాతిల గంగమ్మ, తులసిగాం, ఇచ్ఛాపురం మండలం

పది సార్లు తిరిగాను



ఉదయం నుంచి ఇప్పటి వరకు పది సార్లు సచివాలయం చుట్టూ తిరిగాను. అయినా పింఛన్ ఇవ్వలేదు. గురువారం ఉదయం రావాలంటూ అక్కడి వారు చెప్పారు. ప్రతి నెల ఒకటో తారీఖున వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. మాలాంటి ముసలివారి ఉసురు చంద్రబాబునాయుడుకు తగలక మానదు.
– బాకి తరిణమ్మ, లొద్దపుట్టి, ఇచ్ఛాపురం మండలం



టెక్కలి: టెక్కలి సచివాలయం-4 వద్ద పింఛన్ కోసం వచ్చిన ఓ దివ్యాంగురాలి అవస్థ



శ్రీకాకుళంలోని మహాలక్ష్మి నగర్ కాలనీ సచివాలయానికి మనవరాలు సాయంతో పింఛన్ తీసుకునేందుకు వస్తున్న వృద్ధురాలు

పింఛన్ల పంపిణీ

నెల	మే	జూన్	జూలై	ఆగస్ట్	సెప్టెంబర్	అక్టోబర్	నవంబర్	డిసెంబర్	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్
తొలిరోజు పంపిణీ శాతం	81.33%	72.06%	81.90%	67.76%	78.91%	77.35%	60%	76 %	81.28%	77.48%	29.26%

వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తే తొలిరోజునే దాదాపు డెబ్బై శాతం మందికిపైగా పింఛన్లు అందేవి. కానీ ఈ నెల సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని చెప్పారు. దీంతో తొలిరోజు 29.26 % మందికి మాత్రమే పింఛన్లు అందించగలిగారు.

'ప్రచారమేదైనా అనుమతి ఉండాల్సిందే'



శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేపట్టబోయే ఎలాంటి ప్రచారానికైనా సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సిందేనని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ స్పష్టం చేశారు. లోక్‌సభ వరకూ జిల్లా ఎన్నికల అధికారి, అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించి అక్కడి ఆర్‌ఓలు అనుమతులు ఇస్తారని అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో 40వ వారపు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ క్రమంలో వివిధ అంశాలపై చర్చించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ పలు సందేహాలను నివృత్తి చేస్తూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఇతర నిబంధనలపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, ఇతరులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార అనుమతులకు దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోగా ఏకగవాక్ష విధానం ద్వారా అనుమతులు ఇస్తామని, వివరాలన్నీ సక్రమంగా ఉంటే 24 గంటల్లో కూడా అనుమతులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. సువిధ యాప్ లో లేదా ప్రత్యక్షంగా పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన సింగిల్ విండో విభాగంలో, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పార్టీల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అన్ని రకాల అంశాలకు ఒకేసారి దరఖాస్తు చేసుకొంటే అనుమతుల జారీ ప్రక్రియ సులువవుతుందని, ఇప్పటివరకు 150కి పైగా దరఖాస్తులను పరిశీలించి అనుమతులు మంజూరు చేశామన్నారు.

ఓటర్ల సంఖ్య 18,66,030

2024, ఏప్రిల్ 14వ తేదీ వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఫారం-6 సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు. 2024, ఏప్రిల్ 2 ముందు తేదీ నాటికి వచ్చిన అన్ని రకాల దరఖాస్తులను పరిశీలించి తగిన చర్యలు చేపట్టామని చెప్పారు. అన్ని రకాల చేర్పులు, మార్పులు చేశాక జిల్లాలో ఓటర్ల సంఖ్య 18,66,030గా నమోదైందని వివరించారు. ఇప్పటి వరకు 2,55,633 మందికి కొత్త ఎపిక్ కార్డులు పోస్టల్ ద్వారా అందజేశామని చెప్పారు. సి విజిల్ బృందాలు ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లోనే 95 శాతం ఫిర్యాదులు పరిష్కరించాయని వివరించారు. సామాజిక పింఛన్లను ఈనెల 6 తేదీలోగా పంపిణీ చేస్తామని, పంపిణీ కోసం ఎక్కడా వలంటీర్లను వినియోగించడం లేదని, సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తున్నారని స్పష్టం చేశారు.

ఎస్‌బీఐ ఆర్‌ఎం రాజుపై బదిలీ వేటు



- పలు బ్రాంచిల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ చర్యలు
- మొన్న గార, నిన్న నరసన్నపేట ఎస్‌బీఐ బ్రాంచిల్లో బయటపడిన అక్రమాలు
- ఆర్‌ఎంపై వేటుతో ఆందోళనలో బ్యాంకు ఉద్యోగులు
- కొత్త రీజనల్ మేనేజర్‌గా అబ్దుల్ హసీబ్ అమీర్

శ్రీకాకుళం అర్బన్/ శ్రీకాకుళం క్రైమ్:



నూతన ఆర్‌ఎం అబ్దుల్ హసీబ్ అమీర్

జిల్లాలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుస అక్రమాలపై బ్యాంక్ ఉన్నతాధికారులు, విజిలెన్స్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గత ఏడాది గార ఎస్‌బీఐలో జరిగిన గోల్డ్ స్కామ్, తాజాగా నరసన్నపేట బ్రాంచిలో రూ.3కోట్లకు పైగా జరిగిన రుణాల అక్రమ వ్యవహారాలు బయటపడిన తరుణంలో స్థానిక రీజనల్ మేనేజర్ టీఆర్‌ఎం రాజుపై బదిలీ వేటు వేశారు. ఈ వ్యవహారంతో జిల్లా బ్యాంకింగ్ రంగమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఊహించని విధంగా బ్యాంక్ ఉన్నతాధికారులు ఆర్‌ఎం రాజుపై ముందుగా బదిలీ వేటు వేసి పనిచేసే స్థానాన్ని కూడా ఖరారు చేయలేదు. ఈయన స్థానంలో విజయనగరం జిల్లా బొబ్బిలి ఎస్‌బీఐ ఆర్‌ఎంగా పనిచేస్తున్న అబ్దుల్ హసీబ్ అమీర్‌ను శ్రీకాకుళం నూతన ఆర్‌ఎంగా నియమిస్తూ బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం అబ్దుల్ హసీబ్ అమీర్ బాధ్యతలు స్వీకరించారు.

గత ఆరోపణల ఫలితమేనా..

జిల్లాలో ఇటీవల కాలంగా పలు ఎస్‌బీఐ బ్రాంచిలలో ఉద్యోగులే అక్రమ విధానాల ద్వారా వినియోగదారుల సొమ్మును అడ్డదారుల్లో మింగేస్తున్న వ్యవహారాలు బయటపడుతూ వస్తున్నాయి. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా సంచలనమైన గార బ్రాంచి గోల్డ్ స్కాంతో ఎస్‌బీఐ రీజియన్ కొంత మేరకు మసకబారిపోగా తాజాగా నరసన్నపేట బ్రాంచిలో కూడా రూ.3కోట్లకు పైగా వ్యక్తిగత రుణాలు పేరుతో కొందరు ఉద్యోగులు, ఫీల్డ్ సిబ్బంది కలసి మరో స్కామ్‌కు పాల్పడ్డారు. ఈ రెండు వ్యవహారాలతో జిల్లాలో ఎస్‌బీఐ వ్యవహారం రాష్ట్రస్థాయి అధికారుల దృష్టిలో పడింది. ఇంత వరకూ పనిచేసిన ఆర్‌ఎం రాజు హయాంలోనే ఈ రెండు పెద్ద స్కామ్‌లు బయటపడడంతో ప్రాథమికంగా ఆర్‌ఎం రాజుపై బదిలీ వేటు పడినట్లు ఉద్యోగవర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే నరసన్నపేటలో కీలకంగా వ్యవహరించిన ఫీల్డ్ అధికారి చింతాడ శ్రీనివాస రావు పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్న తరుణంలో కొందరు ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. రీజనల్ మేనేజర్, ఫీల్డ్ అధికారి ఇద్దరి మధ్యే వ్యవహారం నడిచినట్లు అనుమానాలున్నాయి. తాజాగా నరసన్నపేటలో వ్యక్తిగత రుణాల వ్యవహారంపై ఉన్నతాధికారులు ముందస్తుగానే స్పందించి ఆమదాలవలస చీఫ్ మేనేజర్‌ను విచారణాధికారిగా నియమించారని, అలాగే విజిలెన్స్ అధికారులు కూడా దీనిపై విచారణ కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై మాట్లాడేందుకు పాత, కొత్త ఆర్‌ఎంలను 'సాక్షి' సంప్రదించినప్పటికీ ఎలాంటి సమాచారాన్ని ఇవ్వలేదు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, అంధవరపు సూరిబాబు తదితరులు

వివక్ష లేని పాలన అందించాం

- చంద్రబాబుకు అధికారమిస్తే అధోగతే
- మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): 'వివక్ష లేని పాలనను అందించాం.. మీ అందరి మన్ననలూ అందుకున్నాం. ఇదే ఒరవడి కొనసాగాలంటే మీరంతా మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలి' అని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. విపక్ష నేత చంద్రబాబుకు అధికారం ఇస్తే రాష్ట్రానికి అధోగతి తప్పదన్నారు. బాబు అనుభవంతో ఉత్తరాంధ్ర ప్రాంతానికి తీసుకొచ్చిందేమీ లేదని గుర్తు చేశారు. ప్రజలకు మంచి చేయాలన్న మంచి మనసుండాలే తప్ప అనుభవం ఉంటే సరిపోదని అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మెండుగా ఉందన్నారు. శ్రీకాకుళం నగరంలో పుణ్యపువీధి, నానుబాలువీధి పరిసర ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ చంద్రబాబు మన జిల్లాలో చెప్పుకోదగ్గ ఒక్క ప్రాజెక్టయినా పూర్తి చేశారా అని ప్రశ్నించారు. చంద్రబాబు అభివృద్ధి అంతా గ్రాఫిక్స్‌లోనే కనిపిస్తుంది, రియల్‌గా ఎక్కడా కనిపించదన్నారు. ఆయన అనుకూల మీడియా ఈటీవీ,ఏబీఎన్ ఆంధ్రజ్యోతి,టీవీ ఫైవ్ లోనే కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, డివిజన్ నాయకులు ఊడి సునిత, సంజన, వరుదు విజయ్, తోట తారక్, గద్దిబోయిన కృష్ణయాదవ్‌లతో పాటు ఎం.వి పద్మావతి, అంధవరపు సూరిబాబు, రౌతు శంకరరావు, సాధు వైకుంఠరావు, మండవల్లి రవి, వైశ్యరాజు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'చంద్రబాబుకు వృద్ధుల ఉసురు తగులుతుంది'


చింతాడ రవికుమార్

ఆమదాలవలస: వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుపడిన చంద్రబాబుకు వృద్ధుల ఉసురు తగులుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి, ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకులు చింతాడ రవికుమార్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా వలంటీర్లు ఇంటికే వెళ్లి పింఛన్లు అందించారని, ఇప్పుడు సచివాలయాలకు వెళ్లాలని చెప్పడంతో దూర ప్రాంతాల్లో ఉండేవారు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఈ మార్పులను గమనించాలని, ఎవరి వల్ల ఇలా జరిగిందో తెలుసుకోవాలని కోరారు.

సాయిబాబా పెరల్స్ నూతన బ్రాంచి ప్రారంభం


సాయిబాబా పెరల్స్ నూతన బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో గడిచిన 30 ఏళ్లుగా బంగారం వ్యాపారంలో గుర్తింపు పొంది కస్టమర్స్ నమ్మకాన్ని పొందుతున్న సాయిబాబా పెరల్స్ నూతన బ్రాంచి బుధవారం వైభవంగా ప్రారంభమైంది. ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన నూతన బ్రాంచిని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసన్నపేటలో సాయిబాబా పెరల్స్ అధికంగా కస్టమర్స్ నమ్మకాన్ని నిలబెట్టుకున్న సంస్థ అని అన్నారు. ఇలాంటి షాపుల వల్ల నరసన్నపేటకు మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. సాయిబాబా పెరల్స్ సంస్థ ప్రతినిధులు నానాజీ బ్రదర్స్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో పాటు పలువురు పాల్గొని నానాజీ బ్రదర్స్‌ను అభినందించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

టెక్కలి రూరల్: మండలంలోని లింగాలవలస పంచాయతీ పరిధి సన్యాసిపేట గ్రామానికి చెందిన సింగువలస అప్పలమ్మ(30)అనే వివాహిత బుధవారం శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. టెక్కలి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతురాలు అప్పలమ్మ తన భర్త సింహాచలం వేధింపులు కారణంగా గత నెల 28వ తేదీన ఇంటిలో ఎవరు లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఇది గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి తండ్రి జన్ని ఎండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు తెలిపారు.

డీఎస్‌ఏ నియంత్రణలోకి ఇండోర్ స్టేడియం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న ఇండోర్ స్టేడియం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ(డీఎస్‌ఏ) నియంత్రణలోకి వచ్చింది. శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం గతనెల మార్చి 31తో ముగియడంతో ఈ మేరకు డీఎస్‌ఏ చైర్మన్, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఉత్తర్వులు వెలువరించారు. క్రీడాకారులు ఫీజులు చెల్లింపులు పాత విధానంలోనే అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఇండోర్ స్టేడియంకు ఇన్‌చార్జిగా డీఎస్‌ఏ బ్యాడ్మింటన్ కోచ్ కె.ఢిల్లేశ్వరరావు వ్యవహరిస్తారని డీఎస్‌ఏడీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు చెప్పారు.

మూడు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని అరసవిల్లి మిల్లు జంక్షన్ సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనాలపై మద్యం సేవించి వెళ్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో వారిని హాజరుపర్చనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వసంత నవరాత్రులకు శుభరాట

ఇచ్ఛాపురం రూరల్: శ్రీరామనవమి ఉత్సవాలు సందర్భంగా మండలం టి.బరంపురం గ్రామం సీతారామ ఆలయంలో బుధవారం వసంత నవరాత్రులకు శుభరాట వేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో శుభరాటకు పసుపు, కుంకుమతో పూజించారు. ఈ నెల 9 నుంచి 17వ వరకు తొమ్మిది రోజుల పాటు ఆలయంలో అంగరంగ వైభవంగా స్వామివారి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకులు ఫణి శర్మ తెలిపారు.

మేమంతా సిద్ధం అంటూ..

వైఎస్సార్ సీపీ నాయకులంతా మేమంతా సిద్ధం అంటున్నారు. సార్వత్రిక సమరం దగ్గర పడుతుండడంతో ఊరూరా జోరుగా ప్రచారాలు చేస్తూ ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటున్నారు. సామాన్యులను కలుస్తూ, వారి సాధకబాధకాలు ఆరా తీస్తూ పర్యటిస్తున్నారు. ఇంటింటికీ వెళ్తూ పేరుపేరునా పలకరిస్తూ దగ్గరవుతున్నారు.


బూర్జ: అల్లెన పంచాయతీలో ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం


టెక్కలి: శ్రీనివాస నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్


మెళియాపుట్టి: సవరచీడిపాలెంలో వృద్ధురాలికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 14 వార్డులో ప్రచారం చేస్తున్న నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ తదితరులు


సారవకోట: అద్దపనసలో మేము సిద్ధం అంటున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

మరో కొత్త పీజీ కోర్సు

- శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు మెడికల్ బయోటెక్నాలజీ కోర్సు మంజూరు
- ఆంధ్రప్రదేశ్‌లో ఈ కోర్సు మొట్టమొదటిసారిగా అమలులోకి

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మరో కొత్త కోర్సు వచ్చి చేరింది. మెడికల్ బయోటెక్నాలజీ పేరిట కొత్త పీజీ కోర్సు కళాశాలకు మంజూరైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ కోర్సును మొట్టమొదటిసారిగా అమల్లోకి తీసుకొస్తున్న విద్యాసంస్థగా కాలేజీ గుర్తింపు సొంతం చేసుకోనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ మార్గదర్శకాలను అనుసరించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డాక్టర్ రేమి రజని ఉత్తర్వులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, కోర్సు హెచ్‌ఓడీ ఎం.ప్రదీప్, డాక్టర్ ఆర్.హరిత, పి.సుధారాణి కోర్సు ఉత్తర్వులను అందుకున్నారు. రానున్న కొత్త సంవత్సరం 2024–25లో ఎమ్మెస్సీ పీజీ కోర్సుగా మెడికల్ బయోటెక్నాలజీ అందుబాటులో ఉండనుంది.

పరిశోధన, ఉపాధి అవకాశాలు పుష్కలం..

ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ కోర్సు పూర్తిచేసినవారికి అద్భుతమైన అవకాశాలు లభిస్తాయి. ప్రఖ్యాత విద్యాసంస్థలైన ఎయిమ్స్, జిప్మర్, సెంట్రల్ యూనివర్సిటీలలో మాత్రమే అందిస్తున్న ఈ మెడికల్ బయోటెక్నాలజీ కోర్సును శ్రీకాకుళంలో అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి వైద్యరంగంలోనూ, ఫార్మా కంపెనీల్లోనూ, వ్యాక్సిన్ డెవలప్‌మెంట్ విభాగాలలో, డయాగ్నసిస్ సంస్థలలోనూ, పరిశోధనా రంగంలోనూ విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వీటితోపాటు అనేక ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు సాధించవచ్చు.

ఇతర ముఖ్యమైన విషయాలు..

- ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ కోర్సులో ఏడాదికి 20 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలు కల్పించనున్నారు.
- డిగ్రీ బీఎస్సీ కోర్సుల్లో జువాలజీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, హ్యూమన్ జెనిటక్స్ సబ్జెక్టుల్లో ఏదో ఒక సబ్జెక్టుతో డిగ్రీ పూర్తిచేసినవారు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు.
- ప్రభుత్వ రీయింబర్స్‌మెంట్ విధానంలో సీట్లను భర్తీచేసేలా చర్యలు తీసుకుంటున్నారు.
- రీయింబర్స్‌మెంట్ వర్తించని వారికి అతితక్కువ ఫీజులతో కోర్సు పూర్తిచేసేలా అక్కడి అధికారులు చర్యలు తీసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- ఇప్పటికే శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఆర్గానిక్ కెమిస్ట్రీ పీజీ కోర్సు అందుబాటులో ఉంది.


బీఆర్‌ఏయూ వీసీ ప్రొఫెసర్ రజనీ నుంచి కోర్సు మంజూరు ఉత్తర్వులు అందుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, ఎం.ప్రదీప్, డాక్టర్ హరిత

రాష్ట్రంలో మొదటిసారిగా..



జిల్లాకే తలమానికంగా గుర్తింపు పొందిన ఈ కళాశాలకు మరో పీజీ కోర్సు మంజూరుచేయడం సంతోషదాయకం. రాష్ట్రంలో మొదటిసారిగా మెడికల్ బయోటెక్నాలజీ కోర్సును మన ఈ కళాశాల ద్వారా అమల్లోకి రానుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కాలేజియేట్ కమిషనర్, బీఆర్ ఏయూ అధికారుల చొరవ తీసుకుని కోర్సు మంజూరుకు సహకరించినందుకు ధన్యవాదాలు.

– డాక్టర్ పి.సురేఖ, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఉపాధి అవకాశాలు అమోఘం



మెడికల్ బయోటెక్నాలజీ కోర్సు అందుబాటులోకి రానుండడం జిల్లాకు గర్వకారణంగా చెప్పాలి. ఇక్కడి విద్యార్థులకు ఈ కోర్సు చాలా అనువైనది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు వైద్యరంగంలోనూ, ఫార్మా కంపెనీల్లోనూ, వ్యాక్సిన్ డెవలప్‌మెంట్, డయాగ్నసిస్ సంస్థల్లో, పరిశోధనా రంగంల్లో ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి.

– ఎం.ప్రదీప్, మెడికల్ బయోటెక్నాలజీ కోర్సు హెచ్‌ఓడీ, జీడీసీ మెన్ కాలేజ్ శ్రీకాకుళం

జిల్లాకేంద్రంలో కార్డన్ సెర్చ్


ద్విచక్రవాహనం పత్రాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ హరికృష్ణ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలో రెండో పట్టణ పోలీసులు కేంద్ర పోలీసు దళాలతో కలిసి బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్‌ఐ హరికృష్ణ, కానిస్టేబుల్ వెంకటేష్, 23 మంది కేంద్ర పోలీసు దళాలు నగరంలోని గొంటివీధిలో చేసిన కార్డన్‌సెర్చ్‌లో భాగంగా 57 ఇళ్లను తనిఖీ చేశారు. ఇంటి యజమానులను కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులను అడిగి వివరాలు తీసుకున్నారు. 42 వాహనాలను తనిఖీ చేసి వాటి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు.

కోటబొమ్మాళిలో..



కోటబొమ్మాళి: ఎన్నికల నేపథ్యంలో బుధవారం కోటబొమ్మాళి పంచాయతీ రెడ్డికవీధిలో ట్రైనీ డీఎస్పీ రాజారావు, స్థానిక ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 5 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు.

హూండిలో పలు ఆలయాల్లో చోరీ

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు మండలం హూండి ఉమాకామేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి ఆలయాల్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయాల్లో చొరబడి దేవతా మూర్తులకు అలంకరించిన రూ.11 లక్షలు విలువ చేసే దాదాపు 12 తులాల నాగాభరణం, ధారా పాత్ర, రెండు దీపం కుందులు, పంచపాత్ర, మూడు శఠగోపాలు, వెండి నామం, వెండి ప్లేట్, ఉద్దరిణితో పాటు హుండీలోని రూ.10 వేలు వరకు నగదు అపహరించారు. రాత్రి సుమారు 12.30 గంటల సమయంలో శివాలయం వెనుక భాగం నుంచి ప్రవేశించిన దుండగులు ముందుగా సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. భోగం గదిలో ఉంచిన సీసీ కెమెరాలు రికార్డింగ్ చేసే డీవీఆర్ పరికరాలను సైతం తమ వెంట పట్టుకుపోయారు. బుధవారం ఉదయాన్నే శివాలయం పూజారి ఆలయం వద్దకు రాగానే విషయం గుర్తించి ఆలయ ధర్మకర్త కొంచాడ ధర్మారావుకు సమాచారం అందించారు. ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ సీహెచ్ రామారావుకు సమాచారం అందించారు. ఆలయం వద్దకు తన సిబ్బందితో చేరుకున్న ఎస్.రామారావు శ్రీకాకుళం, పలాసలోని క్లూస్ టీమ్‌కు సమాచారం అందించారు. వారు హుటాహుటిన చోరీ జరిగిన ప్రాంతానికి చేరుకుని వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను పరిశీలించారు. ఆలయం పక్కనే రక్తపు మరకలు సైతం ఉండడంతో వాటి నమూనాలు సైతం సేకరించారు. పగలుగొట్టిన తాళాలు, హుండీ, తలుపులు, సీసీ కెమెరాలపై వేలిముద్రలను పరిశీలించారు. కానీ ఎలాంటి ఆధారాలు లభించలేదు. దొంగతనం చేసిన గ్యాంగ్ చాలా టెక్నికల్‌గా వ్యవహరించారని, ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదని కాశీబుగ్గ రూరల్ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్‌ఐ రరామారావులు స్పష్టం చేశారు. హూండి సమీప గ్రామాల్లో ఉన్న సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నామని తెలిపారు.


వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను పరిశీలిస్తున్న క్లూస్ టీం

వేకువ జాము నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పాలిన ఉమామహేశ్వరరావు, గ్రామ పెద్దలు ఆలయాల వద్దకు చేరుకుని పోలీసులతో సంప్రదింపులు చేశారు. శివాలయం ధర్మకర్త కొంచాడ ధర్మారావు, అయ్యప్ప స్వామి ఆలయ గురుస్వామి టి.రాజారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ రామారావు తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. వ్యక్తికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ :

నగరంలోని కృష్ణాపార్కు సమీపంలో ద్విచక్రవాహనాలు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ చెప్పిన వివరాల మేరకు.. పెద్దపాడు రోడ్డులో జీవన్ జ్యోతి నగర్‌లో నివసిస్తున్న ఎస్.సురేష్ కృష్ణాపార్కు సమీపంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో లోన్స్ విభాగంలో పనిచేస్తున్నాడు. విధుల నిమిత్తం ఈనెల 2న రామకృష్ణా థియేటర్‌సందు నుంచి తన ద్విచక్రవాహనంపై కృష్ణాపార్కు చేరుకునేసరికి డేఅండ్‌నైట్ కూడలి నుంచి ఏడురోడ్లకూడలి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న రూరల్ మండలం అలికాం గ్రామానికి చెందిన కళింకోట ఎర్రంనాయుడు ఢీకొట్టాడు. దీంతో సురేష్‌కు గాయమైంది. వెంటనే ఆయనను ఆటోలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



భజ గోవింద అఖండనామ సంకీర్తన యజ్ఞం సందర్భంగా మండలంలోని కేదారిపురంలో బుధవారం నుంచి యాగం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక బాహుదానది నుంచి మహిళలు భక్తి శ్రద్ధలతో కలశాలలో జలాలను నింపి పురవీధుల్లో యాత్ర సాగించారు. రామచండీదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు యజ్ఞం, అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

పోక్సో కేసులో ఇద్దరికి రిమాండ్

టెక్కలి రూరల్: గత నెల 31వ తేదీన భగవాన్‌పురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తెను వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసిన టెక్కలి పోలీసులు బుధవారం ఆ ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చురుగ్గా ఆఫ్‌షోర్ పనులు

- ప్రాజెక్టు పూర్తయితే 25వేల ఎకరాలకు సాగునీరు
- చకచకా సాగుతున్న పనులు

నందిగాం: జిల్లాలోని నందిగాం, టెక్కలి, పలాస, మెళియాపుట్టి మండలాల పరిధిలో 108 గ్రామాలకు, 25వేల ఎకరాలకు సాగునీరు అందించే ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అప్పటి టెక్కలి ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర కలల ప్రాజెక్టుగా రూపుదిద్దుకున్న ఆఫ్‌షోర్‌ను జలయజ్ఞ ప్రదాత, నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మొదలుపెట్టారు. మహేంద్రతనయ నది నీటికి చాపర వద్ద అడ్డుకట్ట కట్టి రిజర్వాయర్‌లో నిల్వ చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసి రూ.127 కోట్ల అంచనా వ్యయంతో 2008లో మెళియాపుట్టి మండలం రేగులపాడు వద్ద శంకుస్థాపన చేశారు. అయితే వైఎస్సార్ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో అచ్చెన్నాయుడు రెండోసారి శంకుస్థాపన చేయడం తప్ప పనులు చేయలేకపోయారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక.. స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రాజెక్టు పరిస్థితి గురించి ఆయనకు వివరించడంతో రూ.852 కోట్లు అంచనా వ్యయంగా నిర్ధారించి నిధులు మంజూరు చేశారు. సాయిలక్ష్మీ కన్‌స్ట్రక్షన్స్ ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ పనులు చేస్తోంది.

ప్రాజెక్టులో భాగంగా మెళియాపుట్టి మండలంలోని రేగులపాడు కొండ, నందిగాం మండలంలోని బడగాం కొండ మధ్య సహజసిద్ధంగా ఉన్న లోతట్టు ప్రాంతాన్ని రిజర్వాయర్‌గా చేసేందుకు రూపకల్పన చేశారు. దీంతో నందిగాం, మెళియాపుట్టి మండలాల్లోని శారదాపురం, దానుపురం, రేగులపాటు, చీపురుపల్లి గ్రామాలను నిర్వాసిత గ్రామాలుగా ప్రకటించి మెరుగైన ప్యాకేజీ ఇచ్చి, నిర్వాసితులకు వారు కోరుకున్న చోట అన్ని సదుపాయాలతో కాలనీలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రెండు కొండల మధ్య 2.485 కిలోమీటర్ల మేరకు రిజర్వాయర్ గట్టు, 13.60 కిలోమీటర్ల వరద కాలువ ఏర్పాటు, హెడ్ రెగ్యులేటర్, స్పిల్‌వే, కుడి, ఎడమ ప్రధాన కాలువలు, డైవర్షన్ రోడ్డు, 2500 విస్తీర్ణంలో రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని అంచనాలు రూపొందించారు. ప్రస్తుతం గట్టు పని 70శాతం, హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం 60శాతం, వరద కాలువ నిర్మాణం 70శాతం, కుడి ప్రధాన కాలువ పని 5శాతం పూర్తి కాగా, స్పిల్‌వే కోసం ఎర్త్‌వర్క్ పూర్తి కాగా ఎడమ ప్రధాన కాలువ పని ఇంకా ప్రారంభించాల్సి ఉందని అధికారులు తెలియజేశారు. 1.860 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా నందిగాం మండలంలో 12,090 ఎకరాలకు, మెళియాపుట్టి మండలంలో 3,890 ఎకరాలకు, టెక్కలి మండలంలో 1820 ఎకరాలకు, పలాస మండలంలో 6800 ఎకరాలకు మొత్తం 24,600 ఎకరాలకు సాగునీరు, కాశీబుగ్గ–పలాస జంటపట్టణాలకు తాగునీరు అందే అవకాశం ఉంటుంది. ఈ రిజర్వాయర్‌కు 75శాతం అనగా 1.631 టీఎంసీ నీటిని మహేంద్రతనయ నది నుంచి వరద కాలువ ద్వారా వస్తే మిగిలినది క్యాచ్‌మెంట్ ఏరియాలో లభిస్తుంది.


రెండు కొండల మధ్య నిర్మాణం జరుపుకుంటున్న రిజర్వాయర్ గట్టు


కుడి ప్రధాన కాలువ స్లూయిజ్

పనులు వేగంగా జరుగుతున్నాయి



ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రాజెక్టులో ప్రస్తుతం రూ.288 కోట్లతో సివిల్ పనులు కొనసాగుతున్నాయి.

– కె.శ్రీకాంత్, ఈఈ, వంశధార ప్రాజెక్టు